



హైదరాబాద్‌లో కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, పట్నం నరేందర్‌రెడ్డి



భూత్పూరు మండలం పాత మొల్గర శివారులో కొత్త చెక్‌డ్యాం వద్ద కేటీఆర్ బర్త్‌డే సందర్భంగా కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆల


# శతమానం భవతి

- ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు
- ఉమ్మడి జిల్లాలో కేక్ కటింగ్‌ల జోరు
- చెక్‌డ్యాం వద్ద వేడుకలు చేసిన ఆల

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదిన వేడుకలు అభిమానులు, నాయకులు బుధవారం ఘనంగా నిర్వహించారు. పల్లె, పట్నం అన్న తేడా లేకుండా ఉమ్మ డి జిల్లా వ్యాప్తంగా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాలు, కూడళ్లలో కేకులు కట్ చేసి సంబురాలు చేసుకున్నారు. దవాఖానల్లో రోగులకు, పాలమూరులోని అంధుల పాఠశాలలో విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వాములై, ప్రియనేత నిండు నూరేండ్లు వర్ధిల్లాలని మనసారా కోరుకున్నారు. వెల్దండకు చెందిన పార్టీశ్రేణులు రాజధానిలోని తెలంగాణ భవన్‌లో రక్తదానం చేయగా.. ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిపించారు. అడ్డాకులలో గిఫ్ట్ ఏ స్మైల్ కింద స్థానికులకు గొడుగుల పంపిణీ చేశారు. భూత్పూరు మండలం పాత మొల్గర శివారులో నూతన చెక్‌డ్యాం వద్ద పార్టీ కా ర్యకర్తలతో కలిసి మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి కేక్ కటింగ్ చేశారు. యువతకు రోల్ మోడల్ కేటీఆర్ అ ని కొనియాడారు. అలాగే హైదరాబాద్‌లో కేటీఆర్‌ను అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి కలిసి పుష్పగుచ్ఛం అందించి బర్త్‌డే విషెస్ తెలిపారు.



కల్వకుర్తిలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం బ్యాంక్, కుంభం కృష్ణయ్య రూ.1.60 లక్షల రుణం తీసుకుంటే కేవలం రూ.64,430 మాత్రమే మాఫీ అయినట్లు ఫోన్‌కు వచ్చిన మెసేజ్



రైతు సంక్షేమానికి, వికాసానికి కట్టుబడి ఉన్న ప్రజా ప్రభుత్వం "రైతు ఋణ మాఫీ - 2024" క్రింద శ్రీ KUMBAM KRISH గారికి,రూ64430/- బ్యాంక్ ఖాతా నంబర్ XXXXXX9036 APGVB HYDERABAD X బ్రాంచ్ యందు తేది 18.07.2024 న జమ చేయబడినది. వివరాలకు మీ బ్యాంక్ అధికారిని/మండల వ్యవసాయ అధికారిని సంప్రదించగలరు.
మీ ఈ ఆనందంలో పాలుపంచుకోవడం నాకెంతో సంతోషంగా ఉంది.

మీ ముఖ్యమంత్రి
శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి.

### రుణమాఫీ రాలేందంటున్నారు..



వీపనగండ్ల ఐవోబీ బ్యాంక్‌లో క్రాప్‌లోన్ రూ.20 వేలు తీసుకున్నాం. మాకు 30 గుంటల భూమి ఉంది. మాఫీ లిస్టులో నా పేరుంది. రుణమాఫీ జరిగి కూడా వారం రోజులు అయ్యింది. బ్యాంకుకు పోయి అడిగితే, ఇంకా రాలేదు, టైం పడుతుంది అంటున్నారు. మాకు అర్థం కావడం లేదు. చు ట్టూ గ్రామాల్లోని బ్యాంకుల్లో డబ్బులు జమ కావడమేందీ..ఇక్కడ కాకపోవుడు ఏందో అధికారులకే తెలియాలే.

- మోహన్‌గౌడ్, రైతు, వీపనగండ్ల, వనపర్తి జిల్లా


- కల్వకుర్తిలో రుణమాఫీ మాయాజాలం
- డీసీసీబీ బ్రాంచ్‌లో 3,651 మందికి 726 మంది రైతులకే వర్తింపు
- బ్యాంకర్లు, అధికారుల చుట్టూ రైతుల ప్రదక్షిణలు
- రుణమాఫీ తీరుపై అన్నదాత ఆగ్రహం
- రైతన్నల ఆందోళన

'అత్యంత ప్రతిష్ఠాత్మకంగా రూ.లక్ష వరకు ఏకకాలంలో రుణమాఫీ చేశాం'.. అని ప్రభుత్వం ఊదరగొడుతుంటే.. క్షేత్ర స్థాయిలో పరిస్థితి మరోలా ఉంది. రుణమాఫీకి ఇచ్చిన జీవోకు, సీఎం రేవంత్, మంత్రులు చేస్తున్న ప్రకటనలకూ ఎక్కడా పొంతన లేకపోవడం.. రైతులను అయోమయానికి గురి చేస్తున్నది. రూ.లక్ష వరకు బ్యాంక్‌లో వ్యవసాయ రుణం ఉన్న ప్రతి రైతుకూ మొదటి విడుతలో మాఫీ చేశామని సర్కారు ప్రకటించింది. కానీ చాలా మంది తమకు ఇంకా వర్తించలేదని ఆందోళన చెందుతున్నారు. బ్యాంకులు, వ్యవసాయాధికారుల వద్దకు పరుగులు పెడుతున్నారు. ఇంతకూ తమకు రుణమాఫీ అవుతుందా..? లేదా అన్న సందేహాలు రైతుల నుంచి వ్యక్తమవుతున్నాయి.

– కల్వకుర్తి, జూలై 24

**డీసీసీబీ కల్వకుర్తి బ్రాంచ్ పరిధిలో..**

డీసీసీబీ కల్వకుర్తి బ్రాంచ్ పరిధిలో మొత్తం 5 (కల్వకుర్తి, వెల్దండ, చారకొండ, మిడ్జిల్, రంగాపూర్)ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు (పీఏసీసీఎస్) ఉన్నాయి. వీటిలో 3,651 మంది రైతులు రూ.లక్ష రుణానికి అర్హత ఉంటే కేవలం 726 మంది రైతులకు మాత్రమే మాఫీ అయ్యింది.



# కొర్రీలతో కోత

### అసలుకంటే మిత్తే ఎక్కువగా..

కల్వకుర్తి మున్సిపాలిటీకి చెందిన రైతు నాదిరి బలరాం కల్వకుర్తి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం(పీఏసీసీఎస్‌లో)లో వ్యవసాయ రుణం తీసుకున్నాడు. 2023 అక్టోబర్ 10వ తేదీన తాను తీసుకున్న రుణాన్ని రెన్యువల్ చేసుకొని రూ.45 వేలు తీసుకున్నాడు. ప్రభుత్వం రుణమాఫీ ప్రకటన నేపథ్యంలో పీఏసీసీఎస్ అధికారులు 2023, డిసెంబర్ 12 నాటికి అసలు రూ.45,000, మిత్తి రూ.569తో కలిసి రూ.45,569 అయ్యిందని అధికారులకు పంపించారు. ప్రభుత్వం ప్రకటించిన రూ.లక్ష రుణమాఫీ జాబితాలో బలరాం పేరు లేదు. తనకు రుణమాఫీ ఎందుకు రాలేదని పీఏసీసీఎస్ అధికారులను వాకబు చేశాడు. తాము రుణ వివరాలన్నీ ప్రభుత్వానికి పంపించాం.. తమ తప్పేమి లేదని, వ్యవసాయాధికారులను సంప్రదించమని పీఏసీసీఎస్ అధికారులు, బలరాంకు చెప్పి పంపించారు. బలరాం నేరుగా కల్వకుర్తి వ్యవసాయాధికారులను కలిసి సమస్య విన్నవించాడు. వ్యవసాయాధికారులు తమ వద్ద ఉన్న యాప్‌లో చూస్తే తీసుకున్న వ్యవసాయ రుణానికన్నా మిత్తి ఎక్కువగా ఉన్నది. అందుకే మాఫీ కాలేదని చెప్పడంతో బలరాం దిక్కుతోచని స్థితిలో పడ్డాడు. ఇలా రకరకాల సాంకేతిక కారణాలతో చాలా మంది అర్హత ఉన్న రైతులకు రుణమాఫీ కాకపోవడంతో ప్రభుత్వం తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ తీరు 'కొండను తవ్వి ఎలుకను పట్టిన' చందంగా ఉన్నదని కర్షకులు మండిపడుతున్నారు. రుణమాఫీ విషయంలో ప్రభుత్వం ఆచరణను పక్కనపెట్టి గొప్పలకు పోయి నవ్వుల పాలైందని రైతు సంఘం నాయకులు దుయ్యబడుతున్నారు.

### ఎంకి పెళ్లి సుబ్బి చావు కొచ్చిందన్నట్లు'..

ఎంకి పెళ్లి సుబ్బిచావుకు వచ్చిందన్న చందంగా.. రైతు రుణమాఫీ బ్యాంకర్లు, వ్యవసాయాధికారులకు తీవ్ర ఇబ్బందులు కలుగజేస్తున్నాయి. మాకు రూ.లక్ష వరకే రుణం ఉన్నది.. నాకు ఎందుకు మాఫీ కాలేదని రైతులు బ్యాంకు, వ్యవసాయాధికారులను నిలదీస్తున్నారు. అందరికీ వచ్చి మాకు ఎందుకు రాలేదు.. మీరే ఏదో చేశారని అనుమానంగా, అమాయకంగా అడుగుతుండడంతో రైతులకు బ్యాంకర్లు, వ్యవసాయాధికారులకు ఏం సమాధానం చెప్పాలో అర్థం కాని అయోమయ పరిస్థితి ఏర్పడింది. మాఫీ అయిన రైతుల్లో కొందరికి తీసుకున్న రుణం మాత్రం ఉంటే గతేడాది జనవరిలో ఒక రైతు రూ.60 వేలు తీసుకుంటే రూ.60 వేలు మాత్రమే రుణమాఫీ అయ్యింది. మరికొందరు రైతులు రూ.60 వేలు తీసుకుంటే 2023 డిసెంబర్ 12వ తేదీ వరకు మిత్తితో కలిపి వచ్చింది. ఇలా పలు చోట్ల తిరకాసు ఉన్నదని, గత కేసీఆర్ సర్కారు రూ.లక్ష వరకు రుణాన్ని మాఫీ చేసేందుకు రూ.28 వేల కోట్లు వినియోగిస్తే.. ప్రస్తుత ప్రభుత్వం రూ.లక్ష వరకు కేవలం రూ.6.080 కోట్లు మాత్రమే వినియోగించిందని.. ఇందులోనూ చాలా మతలబు ఉన్నదని నాయకులు అంటున్నారు. ఏదేమైనా భూమి పట్టాదారు పాసుపుస్తకం ఉండి రూ.2 లక్షల రుణం ఉన్న ప్రతి రైతుకూ మాఫీ చేయాల్సిందేనని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

### రుణమాఫీపైనే సందేహాలు

రూ.లక్ష వరకు రుణాలు చాలామంది రైతులకు వర్తించకపోవడంతో రుణమాఫీ ఏ ప్రాతిపదికన చేశారనే సందేహాలు రైతుల నుంచి వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ జీవో ప్రకారం రేషన్‌కార్డు, ఐటీ చెల్లించే వారిని ప్రామాణికంగా తీసుకున్నారా..? లేదా ముఖ్యమంత్రి, మంత్రులు చెప్పిన విధంగా పరిగణలోకి తీసుకున్నారా..? అనేది అర్థం కాని పరిస్థితి. రేషన్ కార్డులో కుటుంబ సభ్యులు ఎందరిపై రుణం ఉన్నా గరిష్ఠంగా రూ.2 లక్షల వరకు రుణమాఫీ అవుతుందని, ఐటీ చెల్లించే వారికి వర్తించదని జీవో సారాంశం. రేషన్ కార్డు కేవలం కుటుంబ సభ్యుల వివరాలు తెలుసుకునేందుకు మాత్రమేనని, ఐటీ అనేది పెద్ద ఉద్యోగులకు మాత్రమేనని ముఖ్యమంత్రి, మంత్రులు చెబుతున్నారు. దురదృష్టం ఏమిటంటే.. ఇల్లు, వాహనాల రుణాన్ని పొందేందుకు చాలామంది ఏ ఉద్యోగం లేకున్నా.. నామమాత్రం ఐటీ కడుతున్నారు. నామమాత్రం ఐటీ కట్టేవారికి కూడా మాఫీ వర్తించలేదని తెలుస్తుంది. మొత్తం మీద రుణమాఫీ ప్రక్రియ లోపభూయిష్ట విధానాలతో ఉన్నదని, అందుకే చాలామంది రైతులకు రుణమాఫీ వర్తించలేదని, ఇందులో తీసుకున్న జాబితాలో చాలా సాంకేతిక సమస్యలు ఉండటంతోనే మాఫీ ప్రక్రియ ప్రశ్నార్థకంగా మిగిలిందని రైతు సంఘం నాయకులు ఆరోపిస్తున్నారు.

*రుణమాఫీ అయిన రైతుల వివరాలు*

| పీఏసీసీఎస్ | అర్హులు | మాఫీ రైతులు |
|---|---|---|
| కల్వకుర్తి | 977 | 192 |
| చారకొండ | 663 | 160 |
| మిడ్జిల్ | 340 | 99 |
| రంగాపూర్ | 265 | 15 |
| వెల్దండ | 1400 | 260 |
| మొత్తం | 3,651 | 726 |

వనపర్తి పట్టణంలోని ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్





# జమకాని రుణమాఫీ

- ఐవోబీలో సాంకేతిక లోపం
- 1,100 అకౌంట్లకు అందని డబ్బు
- 15 రోజులు తప్పదంటున్న బ్యాంకర్లు
- అయోమయంలో అన్నదాతలు

వనపర్తి, జూలై 24 (నమస్తే తెలంగాణ) : ప్రభుత్వం ప్రకటించిన రూ.లక్షలోపు ఉన్న రుణమాఫీ పథకం అన్నదాతలను ఆందోళనకు గురిచేస్తున్నది. ఇందులో వివిధ రకాల సమస్యలు ఉత్పన్నమవుతుండడంతో రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. పైపైన రుణమాఫీ వ్యవహారం ఆహో.. ఓహో అని చెబుతున్నా కిందిస్థాయిలో చూస్తే.. రైతులకు నిద్రపట్టడం లేదు. ప్రభుత్వం చెబుతున్నట్లుగా అర్హతల మేరకు ఉన్న రైతులకైనా వారి బ్యాంకు ఖాతాల్లో రుణమాఫీ డబ్బులు జమ అయ్యి ఉంటే, ఇంత గందరగోళం ఉండేది కాదు. వాస్తవ పరిస్థితులను చెప్పేందుకు అధికార యంత్రాంగం సైతం ఒకరిపై ఒకరు దాటవేస్తూ రైతాంగాన్ని మరింత కంగారెత్తిస్తున్నారు. దీంతో రైతులు ఎవరికి చెప్పుకోవాలో తెలియక అయోమయానికి గురవుతున్నారు. జిల్లాలో మొత్తం 56 బ్యాంకులు ఉండగా 1,17,220 అకౌంట్ల ద్వారా రైతులకు పంట రుణాలిచ్చారు. వీటిలో లక్ష రూపాయలలోపు రుణమున్న 29,613 అకౌంట్లకు రూ.156.92 కోట్లను మొదటి దశలో రుణమాఫీని వారం కిందట ప్రభుత్వం ప్రకటించింది.

### ఐవోబీలకు చేరని మాఫీ..

ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకులకు రైతు రుణమాఫీ డబ్బులు ప్రభుత్వం నుంచి ఇంకా జమకాలేదు. మిగిలిన బ్యాంకులకు రుణమాఫీ డబ్బులు జమ అయినప్పటికీ జిల్లాలోని రెండు ఐవోబీ బ్రాంచీలకు నిధులు జమకాకపోవడంతో రైతులు బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. ఇతర బ్రాంచీల్లోనూ కొన్ని సమస్యలు ఉత్పన్నం అవుతున్నప్పటికీ ఇక్కడ మాత్రం అసలు నిధులే ఇప్పటి వరకు జమ కాకపోవడంతో తీవ్ర గందరగోళం నెలకొంది. జిల్లాలోని వీపనగండ్ల, వనపర్తి కేంద్రాల్లో ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్‌లు కొనసాగుతున్నాయి. వీటి పరిధిలో దాదాపు లక్షలోపు రుణమున్న రైతులు, మాఫీ పథకంలోకి వచ్చే రైతుల అకౌంట్లు దాదాపు 1100 వరకు ఉన్నాయి. ఇందులో రూ.5 వేలు మొదలుకొని లక్షలోపు అప్పున్న రైతులు మాత్రమే ఉన్నారు. అయితే ఈ లెక్కన ఈ అకౌంట్లకు రూ.కోటీ 70లక్షలు రుణమాఫీ కింద ఈ రెండు బ్యాంకులకు చేరాల్సి ఉంది.

### 15 రోజులు ఆగండి..

రెండు నెలల నుంచి రెండు రూ.లక్షలలోపు రుణమాఫీ పథకం ప్రచారం ఉధృతంగా సాగుతున్నది. దీనిపై రైతులు గంపెడాశలతో కంట్లో ఒత్తులేసుకొని ఎదురు చూస్తున్నారు. ఎట్టకేలకు ఈ నెల 18న ప్రభుత్వం అట్టహాసంగా రుణమాఫీని మొదలు పెట్టిన సంగతి విధితమే. ఇందులో ఏర్పడ్డ అనేక సమస్యల వల్ల మాఫీ నిధులు రాక రైతులు అల్లాడుతున్నారు. ప్రస్తుతం జిల్లాలో రెండు ఐవోబీ బ్యాంకుల్లో నిధులు జమ కానందున రైతులంతా బ్యాంకులకు వెళ్లి ఆరా తీస్తున్నారు. వెళ్లిన రైతులకు మరో 15రోజులు ఆగాలని, సాంకేతిక సమస్య వల్ల నిధులు జమ కాలేదని, ఇందుకు సమయం తీసుకుంటుందని రైతులకు బ్యాంకర్లు చెబుతుండడంతో ఎటూ పాలుపోని స్థితిని ఎదుర్కొంటున్నారు. ఇతర బ్యాంకుల్లో నిధులు జమ అయి రైతులు చక్కగా సేద్యం పనులు చేసుకుంటుంటే.. ఇక్కడ మాత్రం ఆగాలి అంటుండడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు.

### రుణమాఫీ వచ్చింది కానీ..



నేను కల్వకుర్తి ఏపీజీవీబీలో తొమ్మిది నెలల కిందట రూ.1.60 లక్షల రుణం తీసుకున్నాను. రూ.2లక్షల రుణమాఫీ జాబితాలో నా పేరు ఉంటుందని భావించాను. ఈనెల 20 తారీఖున నా ఫోన్‌కు ఒక మెసేజ్ వచ్చింది. మీ ఖాతాలో రూ.64,430 రుణమాఫీ డబ్బులు జమ అయ్యాయని మెసేజ్ సారాంశం. రూ.1.60 లక్ష వ్యవసాయ రుణం ఉంటే కేవలం రూ.64 వేలు మాత్రమే రుణం మాఫీ అయిందని మెసేజ్ వచ్చింది. మిగతా రూ.లక్ష రెండో విడుతలో మాఫీ అవుతుందో లేదా..అంతే సంగతులేమో చూడాలి.

- కుంభం కృష్ణయ్య, రైతు, కల్వకుర్తి

### మాఫీ రాలేదు..



కల్వకుర్తి పీఏసీసీఎస్ బ్యాంకులో 2023 మార్చి 3న రూ.89,192 రుణం తీసుకున్నాను. కటాఫ్ తేదీ వరకు మిత్తిని లెక్కించినా రూ.లక్షలోపే ఉంటుంది. బ్యాంకుకు వచ్చి అధికారులను కలిస్తే.. తాము మొత్తం జాబితా పంపించాం.. మా వద్ద ఎలాంటి పొరపాటు లేదని చెప్పారు. వ్యవసాయాధికారులను కలవాలని సూచించారు. వారు ఏం చెప్తారో.. ఇంతకు రుణమాఫీ ప్రాప్తం ఉందో.. లేదో.. ఏం సర్కారో ఏమో... అరచేతిలో బెల్లం పెట్టి మోచేతి వరకు నాకిస్తున్నారు.

- వి. కృష్ణయ్య, రైతు, మార్చాల, కల్వకుర్తి మండలం, నాగర్‌కర్నూల్ జిల్లా

### సమాచారం లేదంటుండ్రు



కల్వకుర్తి పీఏసీసీఎస్‌లో రూ.58, 468 వ్యవసాయ రుణం తీసుకున్నాను. 2023 డిసెంబర్ 12 నాటికి మిత్తి రూ.7,411 తో కలిపి రూ.65,879 అయ్యింది. ప్రభుత్వం ప్రక టించిన మాఫీ జాబితాలో నా పేరు లేదు. పీఏసీసీ ఎస్ అధికారులను కలిస్తే మేము పంపించాం. మా వద్ద ఏ పొరపాటు లేదు. అగ్రికల్చర్ అధికారులను సంప్రదించాలన్నారు. వారి వద్దకు వెళ్తే నా వివ రాలను తమ వద్ద ఉన్న యాప్‌లో చూస్తే నోఫౌండ్ (ఏ సమాచారం లేదని) వచ్చింది. మాఫీ కాకపోవడంతో ప్రక్రియపైనే అనుమానం వస్తుంది.

- తలసాని శేఖర్‌రెడ్డి, రైతు, కల్వకుర్తి, నాగర్‌కర్నూల్ జిల్లా

### జాబితాలో నా పేరే లేదు..



కల్వకుర్తి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో రూ.55వేలు వ్యవసాయ రుణం తీసుకున్నా. రుణమాఫీ కటాఫ్ తేదీ వరకు మిత్తి 2,858తో కలిపి మొత్తం రూ57,858 అయ్యింది. రుణమాఫీ జాబితాలో నాపేరు రాలేదు. ఎందుకు రాలేదని బ్యాంకు అధికారులను వాకబు చేశాను. తాము జాబితా పంపించామని, తమ తప్పేమి లేదని బ్యాంకు అధికారులు చెప్పారు. వ్యవసాయాధికారులను అడిగితే తెలుస్తుందని చెప్పారు. అక్కడికి వెళితే వ్యవసాయాధికారులు ఏం చెబుతారో మరి చూడాలి.

- మన్న రవి, రైతు, కల్వకుర్తి, నాగర్‌కర్నూల్ జిల్లా

### మాఫీ అయినా ఆనందం లేదు..



మాకు ఎకరా 20 గుంటల భూమి ఉంది. వీపనగండ్ల ఐవోబీలో రూ.60 వేలు పంట రుణం తీసుకున్నా. ప్రభుత్వం లక్ష రూపాయలలోపు ఉన్న వారందరికీ రుణ మాఫీ చేసింది. నాపేరు కూడా రుణ మాఫీ లిస్టులో వచ్చింది. అయితే.. మాకు మాత్రం ఇంకా డబ్బులు పడలేదని బ్యాంకులో చెబుతున్నారు. 15 రోజుల తర్వాత రమ్మని బ్యాంకు వాళ్లు అంటున్నారు. రుణం మాఫీ అయిందని చెబుతున్నా.. మాకు ఆ ఆనందం లేకుండా పోయింది.

- ఎస్ రాణి, రైతు, అమ్మాయిపల్లి, చిన్నంబాయి మండలం , వనపర్తి జిల్లా

### సాంకేతిక సమస్య వల్లే..



సాంకేతిక లోపం వల్లే రుణమాఫీ నిధులు రైతుల బ్యాంక్ అకౌంట్లలో జమ కాలేదు. ఈ విషయాన్ని ఐవోబీ ప్రధాన కార్యాలయ అధికారులకు తెలియజేశాం. జీరో నుంచి మొదలైన అకౌంట్ల నెంబర్లలో చిన్నపాటి లోపం తలెత్తి ఈ సమస్య వచ్చింది. 15 అంకెలుండాల్సిన బ్యాంకు కోడ్ 14అంకెలు మాత్రమే కనిపిస్తున్నందు వల్ల సాఫ్ట్‌వేర్‌లో ఈ సమస్య వచ్చింది. ఈ సాంకేతిక సమస్యతను త్వరలోనే పరిష్కరిస్తాం. అ యితే.. అర్హత ఉన్న రైతులకు తప్పనిసరి మాఫీ వస్తుంది. ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

- భార్గవి, డిప్యూటీ మేనేజర్, ఐవోబీ, వీపనగండ్ల, వనపర్తి జిల్లా



# రవాణా సౌకర్యాలు మెరుగుపర్చాం

- బ్రిడ్జి పనుల పరిశీలనలో మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి




బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

వనపర్తి, జూలై 24 : మండలంలోని చిమనగుంటపల్లి గ్రామ శివారులో బీఆర్ఎస్ హయాంలో చేపట్టిన హైలెవల్ బ్రిడ్జి పనులను బుధవారం మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత సాగునీటి సరఫరాతోపాటు రవాణా సౌకర్యాలు మెరుగుపడటానికి నియోజకవర్గంలో అ నేక హైలెవల్ బ్రిడ్జీలను నిర్మించినట్లు చెప్పారు. అందులో కొన్ని పూర్తికాగా మరికొన్ని నిర్మాణ దశలో ఉన్నాయన్నాయి. నిర్మాణ దశలో ఉన్న వాటిని కాంట్రాక్టర్లు వేగవంతం చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు బాలీశ్వర్‌రెడ్డి, పురేందర్ తదితరులు ఉన్నారు.

# ప్రతిఎకరాకూ సాగునీరందిస్తాం

- ప్రాజెక్ట్‌లను పూర్తి చేసేందుకు సీఎం కృతనిశ్చయంతో ఉన్నారు
- ఎక్సైజ్, పర్యాటక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు

నాగర్‌కర్నూల్, జూలై 24 (నమస్తే తెలంగాణ) : జిల్లాలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తామని ఎక్సైజ్ అండ్ పర్యాటక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మహాత్మాగాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం (ఎంజీకేఎల్ఐఎస్)భాగమైన గుడిపల్లి గట్టు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి ఆయకట్టులోని మోటర్లకు బుధవారం ఎమ్మెల్యేలు రాజేశ్‌రెడ్డి, వంశీ కృష్ణ, కసిరెడ్డి నారాయణరెడ్డి, మేఘారెడ్డి, కలెక్టర్ సంతోష్‌తో కలిసి మంత్రి జూపల్లి పూజలు చేసి నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కల్వకుర్తి ప్రాజెక్ట్ పరిధిలోని 3.65 లక్షల ఎకరాల ఆయకట్టులో మూడింట రెండు వంతులకు పైగా గుడిపల్లి గట్టు రిజర్వాయర్ నుంచి నీరు అందుతుందన్నారు. రిజర్వాయర్ నుంచి నాగర్‌కర్నూల్, కల్వకుర్తి, అచ్చంపేట ప్రధాన కాల్వలకు నీటిని విడుదల చేయడం జరిగిందన్నారు. పంపుల ద్వారా ప్రతిరోజూ 650 క్యూసెక్కుల నీటిని విడుదల చేయనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని కల్వకుర్తి, అచ్చంపేట, నాగర్‌కర్నూల్ నియోజకవర్గం రైతులకు వానదేవుడి దయతో రెండు పంటలకు సాగునీరు అందజేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి ఇటీవలే ఉమ్మడి జిల్లా ప్రాజెక్ట్‌ల సమీక్షా సమావేశంలో పనుల పురోగతిపై వేగవంతం చేసేలా చర్యలు తీసుకున్నట్లు మంత్రి తెలిపారు. ఉమ్మడి జిల్లాల ప్రాజెక్ట్‌లను పూర్తి చేసేందుకు ముఖ్యమంత్రి కృత నిశ్చయంతో ఉన్నారన్నారు. అనంతరం కృష్ణమ్మకు పూలతో స్వాగతం పలికారు. అంతకు ముందు ఇంజినీరింగ్ అధికారులతో మంత్రి సమావేశమై నీటి లభ్యత, విద్యుత్ వినియోగం తదితర అంశాలపై కూలంకుషంగా చర్చించారు. కార్యక్రమంలో ఇం జినీరింగ్ అధికారులు సత్యనారాయణరెడ్డి, ఈఈ రవీందర్, ఎస్వీఎన్ కంపెనీ ఎండీ శ్రీనివాస్‌రెడ్డితో పాటు స్థానిక నాయకులు తదితరులు ఉన్నారు.



గుడిపల్లి రిజర్వాయర్ వద్ద మోటర్‌ను ఎమ్మెల్యేలతో కలిసి ప్రారంభిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు